క్వార్టర్స్‌లోనే ముగిసిన భారత్ పోరు

- థామస్, ఊబర్ కప్‌లో పరాభవాలు
- డిఫెండింగ్ చాంపియన్స్‌కు చెక్ పెట్టిన చైనా
- జపాన్ చేతిలో చిత్తైన అమ్మాయిలు

చెంగ్డూ: ప్రతిష్టాత్మక థామస్, ఊబర్ కప్ ఫైనల్స్‌లోభారత్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. థామస్ కప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ క్వార్టర్స్‌లో 1-3 తేడాతో చైనా చేతిలో పోరాడి ఓడింది. 2022లో ఇండోనేషియాను ఓడించిన భారత్.. పటిష్టమైన చైనాతో పోరులో మాత్రం తడబడింది. మరోవైపు సీనియర్ల గైర్హాజరీలో ఊబర్ కప్ ఆడిన అమ్మాయిలు.. 0-3 తేడాతో జపాన్ చేతిలో ఓడారు. థామస్ కప్ క్వార్టర్స్ పోరులో భాగంగా హెచ్ఎస్ ప్రణయ్.. 21-15, 11-21, 14-21 తేడాతో షి యుకి చేతిలో ఓడిపోవడంతో చైనాకు ఆరంభంలోనే ఆధిక్యం దక్కింది. ఆ తర్వత డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్.. 15-21, 21-11, 12-21తో లియాంగ్ వె కెంగ్-వాంగ్ చెంగ్‌ల చేతిలో చిత్తయ్యారు. కానీ లక్ష్యసేన్ మాత్రం 13-21, 21-8, 21-14తో లి షి ఫెంగ్‌ను ఓడించి భారత శిబిరంలో ఆశలు రేపాడు. అయితే మరో డబుల్స్ ద్వయం ధ్రువ్-ప్రతీక్ 10-21, 10-21 తేడాతో హె జి థెంగ్ - రెన్ జియాంగ్ యు చేతిలో ఓడటంతో భారత పోరాటం ముగిసింది.

అంతకుముందు ఊబర్ కప్‌లో భారత్‌కు జపాన్ చెక్ పెట్టింది. తొలి సింగిల్స్‌లో అష్మిత.. 10-21, 22-20, 15-21 తేడాతో అయ ఒహోరి చేతిలో పోరాడి ఓడింది. ప్రియ-శృతి ద్వయం 8-21, 9-21 పోరాటం లేకుండానే చేతులెత్తేశారు. ఇషాణి 15-21, 12-21 తేడాతో మాజీ వరల్డ్ నెంబర్ వన్ ఒకుహర చేతిలో చిత్తైంది.

భారత బాక్సర్ల జోరు

- సెమీస్‌కు మరో నలుగురు

అస్తానా: ఆసియా అండర్ 22 యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్ల జోరు కొనసాగుతోంది. అస్తానా (కజకిస్తాన్) వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన క్వార్టర్స్‌లో జాదుమణి సింగ్, నిఖిల్, అజయ్ కుమార్, అంకుశ్ ప్రత్యర్థులను ఓడించి సెమీస్ చేరారు. జాదుమణి (51 కిలోలు) 5-0 తేడాతో భూటాన్ బాక్సర్ పుంత్షోను ఓడించగా 57 కిలోల విభాగంలో నిఖిల్ 4-0 తేడాతో ఉజ్బెకిస్తాన్ ఆటగాడు అయుబ్‌ఖోన్‌ను మట్టికరిపించాడు. అజయ్ (63.5 కిలోలు), అంకుశ్ (71 కిలోలు) రిఫరీ స్టాప్ ది కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) నిర్ణయంతో సెమీస్ చేరారు. ఈ టోర్నీలో ఇప్పటికే 22 మంది బాక్సర్లు సెమీస్ చేరారు. ఇందులో పది మంది పురుషులు కాగా 12 మంది మహిళా బాక్సర్లున్నారు.

అల్కరజ్‌కు షాకిచ్చిన రుబ్లెవ్

- మ్యాడ్రిడ్ ఓపెన్

మ్యాడ్రిడ్: యువ సంచలనం కార్లోస్ అల్కరజ్ (స్పెయిన్)కు మ్యాడ్రిడ్ ఓపెన్ క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. స్పెయిన్ రాజధాని మ్యాడ్రిడ్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన అల్కరజ్‌కు గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో 6-4, 3-6, 2-6 తేడాతో ఏడో సీడ్ రష్యా ఆటగాడు ఆండ్రీ రుబ్లెవ్ షాకిచ్చాడు. తొలి సెట్‌లో ఓడినా రుబ్లెవ్ తర్వాత పుంజుకుని అల్కరజ్‌ను నిలువరించాడు. సెమీస్‌లో రుబ్లెవ్.. అమెరికా ఆటగాడు ఫ్రిట్జ్‌తో తలపడతాడు. మహిళల సింగిల్స్‌లో సబలెంక, రిబాకినా క్వార్టర్స్ నెగ్గి సెమీస్‌లో ఢీకొననున్నారు. మరో సెమీస్‌లో ఇగా స్వియాటెక్ మాడిసన్ కీస్‌ను ఓడించి ఫైనల్ చేరింది.

భారత్‌దే టీ20 సిరీస్

మూడో మ్యాచ్‌లోనూ బంగ్లా ఓటమి

సిల్హెట్: ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లిన భారత మహిళల జట్టు మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0 తో సిరీస్ సొంతం చేసుకుంది. సిల్హెట్ వేదికగా ముగిసిన మూడో టీ20లో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 117 పరుగులే చేసింది. డిలారా అక్తర్ (39) టాప్ స్కోరర్ కాగా భారత బౌలర్లు సమిష్టిగా రాణించి ప్రత్యర్థిని నిలువరించారు. అనంతరం ఛేదనను భారత్ 18.3 ఓవర్లలోనే 3 వికెట్లు మాత్రమే కోల్పోయి పూర్తిచేసింది. షఫాలీ వర్మ (51), స్మృతి మంధాన (47) ధాటిగా ఆడారు.

శరణార్థులకు ఓ జట్టు

స్విట్జర్లాండ్: మరికొద్దిరోజుల్లో పారిస్ వేదికగా జరగాల్సి ఉన్న ఒలింపిక్స్‌లో శరణార్థుల (రెఫ్యూజీ) జట్టును అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య (ఐవోసీ) ప్రకటించింది. 11 దేశాలకు చెందిన 36 మంది అథ్లెట్లు.. ఐవోసీ రెఫ్యూజీ ఒలింపిక్ టీమ్ పేరిట పోటీ పడనున్నారు. వీళ్లు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది శరణార్థులకు ప్రాతినిధ్యం వహిస్తారని ఐవోసీ అధ్యక్షుడు థామస్ బాచ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒలింపిక్స్‌లో శరణార్థుల జట్టు ప్రాతినిధ్యం వహించడం ఇది మూడోసారి. ఈసారి విశ్వక్రీడలలో 36 మంది శరణార్థుల జట్టు బ్యాడ్మింటన్, బాక్సింగ్, కనోయ్, సైక్లింగ్ వంటి 12 క్రీడల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

విండీస్ క్రికెటర్‌పై ఐదేండ్ల నిషేధం

దుబాయ్: మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినందుకు గాను వెస్టిండీస్ వికెట్ కీపర్ బ్యాటర్ డెవాన్ థామస్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఐదేండ్ల నిషేధం విధించింది. లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) 2021 సీజన్‌లో థామస్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడన్న అభియోగాలున్నాయి. సుదీర్ఘ విచారణ తర్వాత ఐసీసీ తాజాగా అతడిపై చర్యలకు ఉపక్రమించింది.

రైజర్స్ అదుర్స్

ఆఖరి బంతికి హైదరాబాద్ ఉత్కంఠ విజయం • రాణించిన నితీశ్, భువనేశ్వర్

పరాగ్ (77)

నితీశ్‌కుమార్ (76*)

సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. సొంత ఇలాఖాలోరాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేస్తూ ప్లేఆఫ్స్ రేసులో ముందంజ వేసింది. వరుసగా రెండు ఓటములతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్..రాయల్స్‌తో మ్యాచ్‌లో సత్తాచాటింది. నితీశ్‌కుమార్‌రెడ్డి, హెడ్ అర్ధసెంచరీలతో పోరాడే స్కోరు అందుకున్న హైదరాబాద్.. రాజస్థాన్‌ను ఆఖరి బంతికి కట్టడి చేసి అద్భుత విజయాన్ని ఖాతాలో వేసుకుంది. జైస్వాల్, పరాగ్ అర్ధసెంచరీలతో రాణించినా..రాయల్స్ గెలుపు వాకిట పరుగు తేడాతో బోల్తా కొట్టింది. రాజస్థాన్‌పై విజయంతో హైదరాబాద్..ప్లేఆఫ్స్ రేసులో ముందడుగు వేసింది.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐపీఎల్‌లో మరో మారు పోరు అభిమానులను కట్టిపడేసింది. గురువారం ఉప్పల్ స్టేడియంలో ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 1 పరుగు తేడాతో రాజస్థాన్‌పై అద్భుత విజయం సాధించింది. తొలుత నితీశ్‌కుమార్ రెడ్డి(42 బంతుల్లో 76 నాటౌట్, 3 ఫోర్లు, 8సిక్స్‌లు), హెడ్(58) బ్యాటింగ్‌తో హైదరాబాద్ 20 ఓవర్లలో 201-3 స్కోరు చేసింది. అవేశ్ ఖాన్ (2-39) ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 200-7 స్కోరు చేసింది. పరాగ్ (77), జైస్వాల్ (67) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. భువనేశ్వర్ (3-41) మూడు వికెట్లు తీయగా, కమిన్స్, నటరాజన్ రెండేసి వికెట్లు తీశారు. భువనేశ్వర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

నితీశ్ అదుర్స్:

తొలుత టాస్ గెలిచిన సన్‌రైజర్స్ తమకు అనుకూలమైన బ్యాటింగ్ వైపు మొగ్గుచూపింది. బౌల్ట్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ మొదటి బంతికే హెడ్ ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపట్టాడు. భారీ షాట్ ఆడబోయిన అభిషేక్(12).. జురెల్‌కు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత హెడ్‌కు నితీశ్‌కుమార్‌రెడ్డి చక్కని సహకారం అందించాడు. మందకోడిగా సాగుతున్న ఇన్నింగ్స్‌లో బౌల్ట్ బౌలింగ్‌లో హెడ్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. చాహల్ వేసిన ఇన్నింగ్స్ 13వ ఓవర్లో నితీశ్‌కుమార్ 6, 4, 6, 4 కొట్టడంతో ఏకంగా 21 పరుగులు వచ్చాయి. బౌలింగ్ మార్పుగా వచ్చిన అవేశ్‌ఖాన్.. 15వ ఓవర్‌లో సిక్స్‌తో ఊపు మీద కనిపించినా..రెండు బంతుల తేడాతో క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా..నితీశ్ చక్కని పరిణితి కనిబరిచాడు. అశ్విన్ ఇన్నింగ్స్ 16వ ఓవర్లో 30 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్న నితీశ్.. వరుసగా రెండు సూపర్ సిక్స్‌లతో స్కోరుబోర్డుకు ఊపుతెచ్చాడు. హెడ్ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన క్లాసెన్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు.

పరాగ్, జైస్వాల్ విజృంభణ:

202 పరుగుల లక్ష్యఛేదనలో రాజస్థాన్‌కు ఆదిలోనే కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. భువనేశ్వర్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లలోనే ఓపెనర్ బట్లర్(0), కెప్టెన్ శాంసన్(0) కనీసం పరుగుల ఖాతా తెరువకుండానే పెవిలియన్ చేరాడు. ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను భుజానేసుకున్న పరాగ్.. జైస్వాల్‌తో కలిసి స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. 10 ఓవర్లు ముగిసేసరికి రాయల్స్ 2 వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేసింది. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని నటరాజన్ 14వ ఓవర్లో జైస్వాల్‌ను ఔట్ చేయడం ద్వారా 134 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. కమిన్స్ వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్లో పరాగ్.. జాన్సెన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో రైజర్స్ తిరిగి పోటీలోకి వచ్చింది. ఈ క్రమంలో నటరాజన్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్లో హెట్‌మైర్(13) కూడా ఔట్ కావడంతో రాయల్స్ ఇబ్బందుల్లో పడింది. రెండు బంతుల తేడాతో జురెల్(1) కూడా ఔట్ కావడంతో రైజర్స్ గెలుపు గాడిలోకి వచ్చింది.

ఆఖరి ఓవర్ డ్రామా

భువనేశ్వర్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో విజయానికి 13 పరుగుల అవసరమైన దశలో రోవ్‌మన్ పావెల్ రెండో బంతికి ఫోర్ బాదాడు. ఆఖరి బంతికి రెండు పరుగులు చేస్తే గెలుపు ఖాయమన్న స్థితిలో పావెల్‌ను భువీ వికెట్ల ముందు ఎల్బీడబ్ల్యూగా దొరకబుచ్చుకున్నాడు. దీంతో పరుగు తేడాతో హైదరాబాద్..రాజస్థాన్‌పై ఉత్కంఠ విజయం సాధించింది.

సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 20 ఓవర్లలో 201-3(నితీశ్‌కుమార్ 76 నాటౌట్, క్లాసెన్ 42 నాటౌట్, అవేశ్‌ఖాన్ 2-39, సందీప్‌శర్మ 1-31), రాజస్థాన్: 20 ఓవర్లలో 200-7(పరాగ్ 77, జైస్వాల్ 67, భువనేశ్వర్ 3-41, కమిన్స్ 2-34).

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	10	8	2	0.62	16
కోల్‌కతా	9	6	3	1.09	12
లక్నో	10	6	4	0.09	12
హైదరాబాద్	10	6	4	0.07	12
చెన్నై	10	5	5	0.62	10
ఢిల్లీ	11	5	6	-0.44	10
పంజాబ్	10	4	6	-0.06	8
గుజరాత్	10	4	6	-1.11	8
ముంబై	10	3	7	-0.27	6
బెంగళూరు	10	3	7	-0.41	6

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

అక్కడ నలుగురు స్పిన్నర్లు కావాలి

- టీమ్ ఎంపికపై రోహిత్ శర్మ స్పష్టత

ముంబై: వచ్చేనెలలో అమెరికా, వెస్టిండీస్ వేదికలుగా జరగాల్సి ఉన్న టీ20 ప్రపంచకప్ కోసం బీసీసీఐ ఇటీవలే భారత జట్టును ప్రకటించగా అందులో నలుగురు స్పిన్నర్లను ఎంపికచేయడంపై వస్తున్న విమర్శలపై కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. టీమ్ ఎంపిక తర్వాత తొలిసారిగా రోహిత్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌తో కలిసి ముంబైలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. 'నేను వివరాల్లోకి వెళ్లదలుచుకోలేదు. కానీ నాకు నలుగురు స్పిన్నర్లు కావాలి. మేం వెస్టిండీస్‌లో చాలా క్రికెట్ ఆడాం. అక్కడ పరిస్థితులెలా ఉంటాయో మాకు అవగాహన ఉంది. అక్షర్, జడేజా బ్యాట్‌తోనూ అదరగొడుతున్నారు. కుల్దీప్, చాహల్ స్పిన్నర్లుగా జట్టును బ్యాలెన్స్ చేస్తారు. నలుగురు స్పిన్నర్లను ఎందుకు తీసుకున్నామన్నది అమెరికాకు వెళ్లాక చెప్తా' అని అన్నాడు. ప్రపంచకప్‌కు భారత్.. కుల్దీప్, చాహల్, జడేజా, అక్షర్ రూపంలో నలుగురు స్పిన్నర్లను తీసుకున్న విషయం తెలిసిందే. రింకూ సింగ్‌ను ఎంపిక చేయకపోవడంపై వస్తున్న విమర్శలపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ స్పందిస్తూ.. జట్టు కూర్పులో భాగంగా రింకూ అవకాశం కోల్పోయాడే తప్ప అతడు చేసిన తప్పేమీ లేదని వివరణ ఇచ్చాడు.

ఒకాయా సరికొత్త ఈ-బైకు

న్యూఢిల్లీ, మే 2: ప్రీమియం ఎలక్ట్రిక్ బైకుల తయారీ సంస్థ ఒకాయా.. దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. 'డిస్రూప్టర్ పేరుతో విడుదల చేసిన ఈ బైకు ధర రూ.1.40 లక్షలుగా నిర్ణయించింది. (సబ్సిడీ చెల్లించిన తర్వాత). కేవలం కిలోమీటర్‌కు 25 పైసలు ఖర్చయ్యే ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 129 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఇందుకోసం సంస్థ 6.37 కిలోవాట్ల పవర్ బ్యాటరీని వినియోగించింది. ముందస్తుగా బుకింగ్ చేసుకున్న వెయ్యి మంది కస్టమర్లకు రూ.500 ప్రత్యేక ఆఫర్ అందిస్తున్నది. దీంతోపాటు ఫెర్రాటో మరో బైక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ బైకు ధర రూ.1,59,999గా నిర్ణయించింది.

నమీబియాలో యూపీఐ తరహా సేవలు!

న్యూఢిల్లీ, మే 2: నమీబియాలో యూపీఐ తరహా ఇన్‌స్టంట్ పేమెంట్ సిస్టమ్ అభివృద్ధికి బ్యాంక్ ఆఫ్ నమీబియాతో తమ విదేశీ అనుబంధ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఎన్‌పీసీఐ తెలిపింది. భారత్‌లో యూపీఐలాగే నమీబియాలో ఓ ఇన్‌స్టంట్ పేమెంట్ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేసేలా ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్).. బ్యాంక్ ఆఫ్ నమీబియాతో అగ్రిమెంట్ చేసుకున్నది. తమ ఈ భాగస్వామ్యం.. నమీబియా ఆర్థిక వ్యవస్థను డిజిటలైజ్ చేయగలదని, పర్సన్-టు-పర్సన్ (పీ2పీ), పర్సన్-టు-మర్చంట్ లావాదేవీలకు దోహదపడుతుందన్న ఆశాభావాన్ని ఎన్‌పీసీఐ వ్యక్తం చేసింది.

పరిశ్రమలకు నీటి కటకట

పైప్‌లైన్ ద్వారా సరఫరాపై సర్కారు నిర్లక్ష్యం • ట్యాంకర్లపైనే ఆధారపడుతున్న ఇండస్ట్రీ

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): పరిశ్రమలకు నీటి కష్టాలు మొదలయ్యాయి. గత కేసీఆర్ సర్కారు పైప్‌లైన్ల ద్వారా పారిశ్రామిక వాడలకు వాటర్ సప్లై చేయడంతో ఇన్నాళ్లూ ఇండస్ట్రీకి ఇబ్బంది లేకుండా అవసరాలు తీరాయి. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పారిశ్రామిక రంగాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాటి ప్రభుత్వం రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్టుల్లో 10 శాతం నీటిని పరిశ్రమలకు రిజర్వు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని జీడిమెట్ల, బాలానగర్, మౌలాలీ, మల్లాపూర్, చర్లపల్లి, నాచారం తదితర పారిశ్రామిక వాడలకు గోదావరి, కృష్ణా జలాలను పైప్‌లైన్ల ద్వారా సరఫరా చేశారు. అలాగే శివార్లలోని పలు పారిశ్రామిక వాడలకూ పైప్‌లైన్లను విస్తరించారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని ఆయా జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాలకే కాకుండా పారిశ్రామిక అవసరాలకూ సరిపోయేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లింది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇండస్ట్రియల్ క్లస్టర్లకు నీటి సరఫరాపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది. కాళేశ్వరం నుంచి నీటి తరలింపును నిలిపి వేయడంతో పరిశ్రమలకు నీటి కష్టాలు తప్పడం లేదు. అంతేకాదు కొత్తగా అభివృద్ధి చేసిన ఇండస్ట్రియల్ పార్క్‌లలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపైనా రాష్ట్ర సర్కారు దృష్టి సారించడం లేదు. సుల్తాన్‌పూర్, భువనగిరి, కాలకల్, వర్గల్, ములుగు, చౌటుప్పల్ తదితర పారిశ్రామిక వాడల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటవుతున్నా అక్కడ నీటి సరఫరా వ్యవస్థ లేకపోవడంతో పరిశ్రమల నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నాటికి.. నేటికి ఇది తేడా

గత పదేండ్లలో 28,000 ఎకరాల్లో 55 కొత్త పారిశ్రామిక వాడలను అప్పటి ప్రభుత్వం అభివృద్ధి చేసింది. అంతేకాదు వచ్చే ఐదేండ్లలో 30,000 ఎకరాల్లో 72 ఇండస్ట్రియల్ పార్క్‌లను అభివృద్ధి చేయాలని ప్రణాళికల్నీ సిద్ధం చేసింది. నిజానికి అంతకుముందు 40 ఏండ్లలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు కలిసి 26,000 ఎకరాల్లో 109 పారిశ్రామిక వాడలనే ఏర్పాటు చేయగలిగాయి. కానీ కేసీఆర్ సర్కారు.. టీఎస్ ఐపాస్ వంటి సరళీకృత సింగిల్ విండో అనుమతుల విధానాన్ని తేవడంతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఫలితంగా ఇప్పటి ప్రభుత్వ తీరు సర్వత్రా విమర్శలపాలవుతున్నది. చేసేదేమీలేక వాటర్ ట్యాంకర్లపైనే ఆధారపడాల్సి వస్తున్నదని, ట్యాంకర్లు సైతం సమయానికి అందుబాటులో ఉండడం లేదని పరిశ్రమ వర్గాలు వాపోతున్నాయి. ఇప్పటికైనా దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నాయి.

వాణిజ్య

అవేవా కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్, మే 2: టెక్నాలజీ సేవల సంస్థ అవేవా.. హైదరాబాద్‌లో తాజాగా కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. భారత్‌లో తన వ్యాపారాన్ని విస్తరించేక్రమంలో ఇక్కడ సెంటర్‌ను నెలకొల్పింది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరు సెంటర్లలో ఇది కూడా ఒకటి కావడం విశేషం. ఈ సెంటర్‌లో 1,200 మందికి పైగా టెక్నాలజీ నిపుణులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అవేవా చీఫ్ కమర్షియల్ అధికారి స్యూ క్వెన్స్ మాట్లాడుతూ..అంతర్జాతీయ వ్యాపారంలో భారత్ చాలా కీలకంగా మారిందని, దీంతో ఇక్కడ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను నెలకొల్పాలని గతంలోనే నిర్ణయించినట్లు, దీనికి అనుగుణంగా ఇక్కడ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు.

ఇండిగో సిబ్బందికి బోనస్

ముంబై, మే 2: చౌక విమానయాన సంస్థ ఇండిగో.. ఉద్యోగులకు శుభవార్తను అందించింది. ప్రత్యేక బోనస్‌ను ప్రకటించింది సంస్థ. 30 అతిపెద్ద ఏ350 విమానాల ఆర్డర్లు వచ్చిన వారం రోజుల తర్వాత, ఆర్థిక ఫలితాలు విడుదల చేయడాని కంటే ముందుగానే ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఈ ప్రత్యేక బోనస్ కింద సిబ్బంది 1.5 నెలల బేసిక్ వేతనాన్ని అందించనున్నది. ఈ బోనస్‌ను మే నెల వేతనంతోపాటు అందించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

బ్లూస్టార్ ప్రాఫిట్ డౌన్

న్యూఢిల్లీ, మే 2: ఏసీలు, కమర్షియల్ రిఫ్రిజిరేటర్ల సంస్థ బ్లూ స్టార్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 29 శాతం తగ్గి రూ.159.71 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇది రూ.225.29 కోట్లుగా ఉన్నది. ఆదాయం మాత్రం రూ.2,830.48 కోట్ల నుంచి రూ.3,340.16 కోట్లకు ఎగబాకింది. నిర్వహణ ఖర్చులు రూ.2,485.46 కోట్ల నుంచి రూ.3,126.36 కోట్లకు పెరగడం వల్లనే లాభాలు తగ్గాయని పేర్కొంది.

రూ.4.26 లక్షల కోట్లు

ప్రభుత్వ సంస్థల్లో మోదీ సర్కారు పెట్టుబడుల ఉపసంహరణ • ప్రైవేట్‌పరమైన ఎయిర్ ఇండియా
విలీనాల దిశగా ప్రభుత్వ రంగ బ్యాంకులు • ఆర్బీఐ స్వయం ప్రతిపత్తినీ దెబ్బ తీసే చర్యలు

ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యమే పరమావధా?.. కార్పొరేట్లకు కొమ్ము కాయడమే కర్తవ్యమా?.. అందినకాడికి అమ్ముకోవడమే లక్ష్యమా?.

> *గత పదేండ్లలో కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తీరు ఇలాగే ఉందన్న విమర్శలు ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నాయి మరి. ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తూ సాగిన ఈ దశాబ్దకాల పాలనలో ఎయిర్ ఇండియా వంటి ప్రతిష్ఠాత్మక సర్కారీ కంపెనీలు కనుమరుగైపోయాయన్నది నిజం.*

దేశ బ్యాంకింగ్ వ్యవస్థనూ వదల్లేదు. ఒకప్పుడు 27 ప్రభుత్వ బ్యాంకులుంటే ఇప్పుడు 12కు పడిపోయాయి. చివరకు బ్యాంకింగ్ రంగ నియంత్రిత సంస్థగా ఉన్న ఆర్బీఐనీ వెంటాడి, డివిడెండ్ల పేరుతో బలహీనపర్చాలని చూడటం.. ప్రభుత్వ పెద్దలకు, ఆర్బీఐ గవర్నర్లకు మధ్య విబేధాల్ని తెచ్చిపెట్టింది.

న్యూఢిల్లీ, మే 2: కుదిరితే ఒక్కసారిగా అమ్మేయడం.. కుదరకపోతే విడుతలవారీగా వాటాలను విక్రయించడం.. మొత్తానికి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ బాట పట్టించడమే లక్ష్యంగా గత పదేండ్ల మోదీ సర్కారు పాలన సాగింది. 2014-15 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణ రూ.4.26 లక్షల కోట్లుగా ఉన్నది. 2017-18లో అత్యధికంగా లక్ష కోట్ల రూపాయలపైనే ఆదాయం వచ్చింది. నిజానికి బడ్జెట్‌లో పెట్టుకున్న లక్ష్యాలు నెరవేరితే.. పెట్టుబడుల ఉపసంహరణలు రూ.10 లక్షల కోట్లు దాటేవే.

డివిడెండ్లతో..

ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఏటా డివిడెండ్ల రూపంలో అందుకున్నదే ఈ పదేండ్లలో రూ.15 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. ఒక్క రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచే ఇందులో సగం వచ్చిందని గణాంకాలు చెప్తున్నాయి. 2018-19లో ఏకంగా రూ.1,76,051 కోట్ల డివిడెండ్‌ను ఆర్బీఐ నుంచి కేంద్ర ప్రభుత్వం అందుకున్నది. ఇదే ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ గవర్నర్ ఊర్జిత్ పటేల్‌తో కేంద్రం గొడవలు తారాస్థాయికి చేరిన సంగతీ విదితమే. ఆర్బీఐ నగదు నిల్వలపై మోదీ సర్కారు కన్నేయడంతోనే పటేల్ తన పదవీకాలం ముగియకుండానే వెళ్లారన్నది చాలామంది అభిప్రాయం. ఈ క్రమంలోనే ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ వచ్చారు.

మోదీ హయాంలో వాటాల అమ్మకం

ఆర్థిక సంవత్సరం	విలువ (రూ.కోట్లలో)
2014-15	24,349
2015-16	23,997
2016-17	46,247
2017-18	1,00,057
2018-19	84,972
2019-20	50,299
2020-21	32,845
2021-22	15,440
2022-23	31,059
2023-24	16,507

అదానీతో దోస్తీ..

ఇక గౌతమ్ అదానీతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్నేహ బంధం.. పెద్ద దుమారాన్నే రేపింది. విదేశాల్లో అదానీ సంస్థలకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం తరఫున మోదీ సహకారం అందించారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో హిండెన్‌